సాక్షి కర్నూలు

మంగళవారం, 14, నవంబర్, 2023



మల్లన్నకు వెండి రథోత్సవ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన, వెండి రథోత్సవ సేవను నిర్వహించారు. పూజల్లో ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు పాల్గొన్నారు.



కేసీకి 2,354 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 2,354 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో పూర్తి స్థాయిలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



దొంగలు దొరికారు

రియల్ ఎస్టేట్ వ్యాపారిని బురిడీ కొట్టించి రూ. 2.20 కోట్లు అపహరించిన ముఠాలో ఇద్దరు ప్రధాన నిందితులను నంద్యాల పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



హొళగుంద వద్ద ఎల్లెల్సీలో నీటి ప్రవాహం

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్దనున్న తుంగభద్ర రిజర్వాయర్‌కు గత కొద్ది రోజులుగా ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఈ ఏడాది డ్యాంలో నీటి చేరిక నిరాశాజనకంగా ఉంది. అయితే ఇటీవల డ్యాం ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాల కారణంగా స్వల్పంగా వరద నీరు డ్యాంలోకి వచ్చి చేరుతోంది. గతేడాది ఇదే సమయానికి 100 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ఈ ఏడాది 25 టీఎంసీలకే పరిమితమైంది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1,633 అడుగులు కాగా.. సోమవారం 1,602.50 అడుగులకు చేరుకుంది. ఔట్‌ఫ్లో 7,993 క్యూసెక్కులు ఉండగా 7,151 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. జిల్లాలోని ఎల్లెల్సీ కాలువ ప్రారంభం వద్ద 715 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

26న తితిదే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్, లలితా పీఠం సంయుక్తంగా ఈనెల 26న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో సామూహిక వ్రతం, కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సామూహిక కార్యక్రమాలతో అత్యంత ప్రభావవంతమైన శక్తి ఉత్పన్నమై జాతితో పాటు జగతికి మేలు చేకూరుతుందన్నారు.

రేపు కర్నూలుకు ప్రెస్ అకాడమీ చైర్మన్

కర్నూలు(సెంట్రల్): ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఈనెల 15న రాత్రి ఆయన కర్నూలుకు చేరుకొని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. 16న ఉదయం 9 గంటలకు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడి యాగంటి ఉమా మహేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసుకుంటారు. అక్కడి నుంచి అనంతపురం జిల్లా పర్యటనకు వెళ్తారు.

సుంకేసుల నుంచి వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి సుంకేసుల నుంచి సోమవారం 6,660 క్యూసెక్కుల వరద నీరు విడుదలైంది. శ్రీశైలం నుంచి దిగువ ప్రాంతాలకు 4,022 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయంలో 64.1764 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నీటిమట్టం 841.50 అడుగులకు చేరుకుంది.

సీమకు వెలుగుల హారం

- మరో రెండు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- కర్నూలు జిల్లాలో విండ్ పవర్, నంద్యాల జిల్లాలో సోలార్ పవర్ ఉత్పత్తి
- ఎకోరన్ సంస్థతో కీలక ఒప్పందం
- ఇప్పటికే నిర్మాణంలో 'గ్రీన్‌కో' రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంటు
- కొత్త పవర్ ప్లాంట్లతో పవర్ హబ్‌గా ఉమ్మడి కర్నూలు జిల్లా

రాయలసీమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. 1,702 మెగావాట్ల సామర్థ్యంతో మరో రెండు విద్యుత్ ప్లాంట్లను నిర్మించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటి నిర్మాణంతో ఉమ్మడి కర్నూలు జిల్లా పవర్ హబ్‌గా మారనుంది. ఇప్పటికే జిల్లాలో గ్రీన్‌కో సంస్థ రూ.15వేల కోట్ల భారీ పెట్టుబడితో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంటు నిర్మిస్తోంది.

సాక్షిప్రతినిధి కర్నూలు: పారిశ్రామిక ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాను పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను తీర్చిదిద్దుతోంది. ఈ కోవలోనే జిల్లాను 'పవర్‌హబ్'గా మార్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం జిల్లాలోని శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అలాగే గ్రీన్‌కో రెన్యువబుల్ ఎనర్జీ, పత్తికొండ ప్రాంతంలో విండ్ పవర్, అవుకులో నిర్మించబోతున్న జలవిద్యుత్ కేంద్రాల ద్వారా 7,905.95 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. ఇవి కాకుండా ఎకోరన్ ఎనర్జీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ద్వారా నిర్మించనున్న సోలార్, విండ్ ప్లాంట్‌తో కలిపి 9607.95 మెగావాట్ల విద్యుత్ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉత్పత్తి కానుంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే 'గ్రీన్ ఎనర్జీ' ఉత్పత్తిలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా ప్రథమస్థానంలో ఉండనుంది.

అన్ని ప్లాంట్లలో గ్రీన్ ఎనర్జీనే

థర్మల్ పవర్ ప్రాజెక్టులో బొగ్గుకాల్చడం, ఇతర కారకాలతో కాలుష్యం వస్తుంది. విండ్, సోలార్, జల విద్యుత్ ద్వారా ఎలాంటి కాలుష్యం ఉండదు. పర్యావరణహితంగా 'గ్రీన్‌ఎనర్జీ'ని ఉత్పత్తి చేయవచ్చు. ప్రపంచం మొత్తం 'గ్రీన్ ఎనర్జీ' ఉత్పత్తి దిశగా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అతిపెద్ద రెన్యువబుల్ పవర్ ప్లాంటు(పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు)ను ఓర్వకల్లు మండలం పిన్నాపురం, గుమ్మితంతండాలో వేగంగా



నిర్మాణంలో ఉన్న రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యుత్ ఉత్పత్తి ఇలా..

➤ గ్రీన్‌కో విండ్, సోలార్, హైడల్ విద్యుత్ ఉత్పత్తి: 5,230 మెగావాట్లు

➤ శ్రీశైలం రిజర్వాయర్ : 1439 మెగావాట్లు(సగటున)	➤ పత్తికొండలో పవన్ విద్యుత్: 636.95 మెగావాట్లు	➤ అవుకులో వ్యాప్కోస్ జలవిద్యుత్ : 600 మెగావాట్లు
➤ ఎకోరన్ ఎనర్జీ పవన విద్యుత్: 800 మెగావాట్లు	➤ ఎకోరన్ ఎనర్జీ సోలార్ ప్లాంటు: 902 మెగావాట్లు	➤ మొత్తం: 9,607.95 మెగావాట్లు

నిర్మిస్తోంది. ప్రపంచంలోని ఇది తొలి ప్రాజెక్టు కావడం విశేషం. గతేడాది 'దావోస్'లో జరిగిన ఆర్థిక సదస్సులో ఈ ప్రాజెక్టు గురించి, గ్రీన్ ఎనర్జీ గురుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావించారు. భవిష్యత్తులో అందరూ గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి దిశగా అడుగులు వేయాలని, ఏపీలో ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. సీఎం చెప్పినట్లే మరో రెండు కీలక ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

800 మెగావాట్లు విండ్, 902 మెగావాట్లు సోలార్

కర్నూలు జిల్లాలో 800 మెగావాట్లతో విండ్ పవర్‌ను ఉత్పత్తి చేయనున్నారు. ఎకోరన్ ఎనర్జీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ దీన్ని చేపడుతోంది. అలాగే 902 మెగావాట్లతో సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 5,400 ఎకరాలను సేకరించనుంది. దీన్ని నంద్యాల జిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లాలోని కొద్ది ప్రాంతంలో నిర్మించనున్నారు. దీన్ని కూడా 'ఎకోరన్' చేపట్టనుంది. సోలార్ భూములకు ఎకరాకు ఏడాదికి రూ.31వేలు చెల్లించనుంది. ఈ మేరకు ఈ నెల 3న జరిగిన మంత్రిమండలి సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఇప్పటికే 5,230 మెగావాట్ల సామర్థ్యంతో 'గ్రీన్‌కో' ప్రాజెక్టు

ఓర్వకల్లు సమీపంలో ఇప్పటికే రూ.15వేల కోట్లతో గ్రీన్‌కో కంపెనీ ప్రాజెక్టు నిర్మిస్తోంది. ఇందులో 1,680 మెగావాట్ల పంప్డ్‌స్టోరేజ్, 3వేల మెగావాట్ల సౌరశక్తి, 550 మెగావాట్ల పవన విద్యుత్ కలిపి మొత్తంగా 5,230 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. 24 గంటలపాటు నిరంతర విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రాజెక్టుకు మరో ప్రత్యేకత ఉంది. డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో(నాన్‌పీక్ అవర్స్)సోలార్, విండ్ పవర్‌ను ఉపయోగించుకుని నీటిని రిజర్వాయర్‌లోకి పంప్ చేయొచ్చు. డిమాండ్ ఎక్కువగా(పీక్ అవర్స్) ఉన్నప్పుడు తిరిగి నీటిని వినియోగించుకుని విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చు. ఈ ప్రాజెక్టులో మిట్టల్ కంపెనీ కూడా పెట్టుబడులు పెట్టనుంది.



సోలార్ ప్లాంట్‌లో నిర్మించిన పలకలు



పవన విద్యుత్ ఉత్పాదన కోసం ఏర్పాటు చేసిన గాలిమరలు

గ్రీన్‌ఎనర్జీకి అత్యంత అనువైన ప్రాంతం కర్నూలు

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 'గ్రీన్‌ఎనర్జీ' ఉత్పాదనకు అత్యంత అనుకూలమైన ప్రాంతాలు కర్నూలు, అనంతపురం. ఈ ప్రాంతాల్లో వర్షపాతం తక్కువ. దీంతో సూర్యరశ్మి ఎక్కువగా ఉంటుంది. ఆకాశం మేఘావృతం కావడం తక్కువ. అలాగే గాలివేగం కూడా ఎక్కువ. దీంతో సోలార్, విండ్‌పవర్ ఏర్పాటుకు ఇవి అత్యంత అనువైన ప్రాంతాలు. అందుకే ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలతో పాటు ఆదోని, నంద్యాల, డోన్ డివిజన్లలో గాలిమరలు, సోలార్ ప్లాంటు ఎక్కువగా ఏర్పాటు చేశారు. మరిన్ని విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే కర్నూలు జిల్లా 'పవర్‌హబ్'గా మారనుంది. 'గ్రీన్ ఎనర్జీ' ఏర్పాటుకు ముందుకొచ్చే కంపెనీలకు మంచి ప్రోత్సాహకాలు ఉంటాయని పలు సందర్భాల్లో ముఖ్యమంత్రి ప్రకటించారు.

అవుకులో జలవిద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

బనగానపల్లె నియోజకవర్గం అవుకులో కూడా రెన్యువబుల్ హైడల్ ఎనర్జీ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ 'వ్యాప్కోస్' ప్లాంటు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. రిజర్వాయర్ నీటితో జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేసి, తిరిగి అదే నీటిని పంప్‌స్టోరేజ్ చేసి పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. 30 నెలల పాటు 'ట్రైల్‌రన్' తరహాలో అక్కడ పరిస్థితులను అంచనా వేసి, అనువుగా ఉంటే ఇక్కడ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. గుమ్మితంతండాలో ఏర్పాటవుతోన్న 'గ్రీన్‌కో' ప్లాంటు తరహాలోనే విద్యుత్ ఉత్పత్తి కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. 'గ్రీన్ ఎనర్జీ' ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ తక్కువ ధరకు లభించనుంది.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను తన నివాసంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచాలని ఆ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత నారాయణస్వామి, ఆలూరు జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, ఆలూరు లైబ్రరీయన్ ఎస్. వెంకటేశ్వర్లు, కురుకుంద గ్రామ సర్పంచ్ దేవిరెడ్డి, రిటైర్డు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో కలసి దీపావళి వేడుకలు..

తన నివాసంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో కలసి మంత్రి గుమ్మనూరు జయరాం దీపావళి వేడుకలను జరుపుకున్నారు. ప్రతి ఒక్కరూ చెడును తొలగించుకుని మంచి ప్రవర్తనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో మంగళవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి పెద్దక్క సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన జరిగే ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన,మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే ఎ. హఫీజ్‌ఖాన్ అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

జగనన్న విద్యా దీవెనకు ఉమ్మడి బ్యాంకు ఖాతా

- ఈ నెల 24 చివరి తేది

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెనకు తల్లితో పాటు విద్యార్థికి ఉమ్మడి బ్యాంకు ఖాతా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ పథకం విడుదలయ్యే నిధులన్నీ తల్లుల ఖాతాల్లోనే జమ అవుతున్నాయన్నారు. ఇకపై పథకం కింద లబ్ధి పొందుతున్న విద్యార్థులు తమ తల్లితో పాటు ఉమ్మడి బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉందన్నారు. కొత్తగా ఓపెన్ చేసే ఈ ఖాతాలో విద్యార్థి ప్రాథమిక ఖాతాదారుగా, తల్లి ద్వితీయ ఖాతాదారుగా ఉండాలన్నారు. ఎస్సీ విద్యార్థులకు, 2022-23 విద్యా సంవత్సరంలో చివరి సంవత్సరం చదువుతున్న అన్ని కేటగిరీలకు చెందిన విద్యార్థులకు ఉమ్మడి ఖాతా అవసరం లేదని జేడీ స్పష్టం చేశారు. ఉమ్మడి ఖాతాలో ఎలాంటి డెబిట్ కార్డు లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్ సౌకర్యం ఉండరాదన్నారు. ఈ నెల 24వ తేదిలోగా ఉమ్మడి బ్యాంకు ఖాతాలను తెరవాలని.. వివరాలను గ్రామ/వార్డు సచివాలయాల్లో అందించాలన్నారు. ఇప్పటి వరకున్న సమాచారం మేరకు ఈ నెల 28న జగనన్న విద్యా దీవెన 4వ విడత నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

కర్నూలు సిటీ: వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్ నెలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలిస్తే ఆధారాలతో ఫిర్యాదులు చేయాలన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి



దీపావళి వేడుకల్లో కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆకాంక్షించారు. కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో ఆమె కుటుంబ సభ్యులు, సిబ్బందితో కలసి ఆదివారం దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. సాయంత్రం 6-7 గంటల మధ్య దీపాలు వెలిగించారు. అనంతరం తండ్రి, రిటైర్డ్ కలెక్టర్ బలరామయ్య, భర్త, కుమారుడితో కలసి బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంచి పెట్టారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

కార్తీకం.. శుభకరం



పాతాళగంగ వద్ద పుణ్యనదీహారతి(ఫైల్)

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- భక్తులతో పోటెత్తనున్న క్షేత్రాలు
- శ్రీశైలంలో కార్తీకమాసోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు
- ప్రతి సోమవారం లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి
- కార్తీక పౌర్ణమిన వైభవోపేతంగా జ్వాలాతోరణం

'న కార్తీక నమో మాసః' అంటూ కార్తీకంతో సమానమైన మాసం లేదని స్కందపురాణం చెబుతుంది. అందుకే అన్ని మాసాల కంటే కార్తీకమాసాన్ని భక్తులు ఎంతో పవిత్రమైన మాసంగా భావిస్తారు. ఈ మాసం శివకేశవులిరువురికి ప్రీతికరం కావడం విశేషం. అందుకే ఈ కార్తీక మాస ఆవరణలో శివకేశవులకు అభేదం కనిపిస్తుంది. అలాగే ఈ కార్తీకంలో ఒక్కొక్క రోజుకు ఒక్కో విశేషం ఉంది. ఈ నెలలో జులూ పర్వదినాలే. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు కృత్తికా నక్షత్రానికి దగ్గరగా ఉండడం చేత ఈ నెల కార్తీకంగా పేరొందింది. కార్తీక మాసంలో ప్రతి ఇల్లు ఓ దేవాలయముగా, ప్రతి ఆలయం ఓ క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఈనెల 14వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభం కావడంతో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది.

శ్రీశైలం టెంపుల్/కర్నూలు కల్చరల్: ఉమ్మడి జిల్లాలోని శ్రీశైలం, మహానంది, యాగంటి, ఓంకారం, భోగేశ్వరాలయం, రుద్రకోడూరులోని క్షేత్రాల్లో కార్తీక మాస పూజలు విశేషంగా నిర్వహిస్తారు. వీటితోపాటు అహోబిలం, మంత్రాలయం, ఉరుకుంద క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. కార్తీక మాసమంతా పుణ్య భావించినప్పటికీ ఆయా తిథిల్లో ప్రత్యేక పూజలు చేపట్టే ఆచారం కూడా ఉంది. ఈ మాసంలో నదీ పుణ్య స్నానాలు, ఉపవాసం, దీపారాధన, దానధర్మాలు, సోమవార వ్రతాన్ని భక్తులు తప్పక పాటిస్తారు.

కార్తీక మాసంలో పర్వదినాలు

14వ తేదీన కార్తీక మాసం ఆరంభం, బలిపాడ్యమి, గో క్రీడోత్సవం, ఆకాశదీప ప్రారంభం, 15న యమ ద్వితీయ, భగినీ హస్త భోజనం, ధన్వంతరిపూజ, 16న త్రిలోచన గౌరీ వ్రతం, 17న నాగ చతుర్థి, వల్మీక పూజ, 18న నాగ పంచమి, భాను సప్తమి, అట్ని పూజనం, 20న కార్త వీర్య జయంతి, గోష్టాష్టమి, వ్రతం, 21న అక్షయ నవమి వ్రతం, 22న యాజ్ఞవల్క్య జయంతి, 23న ప్రబోధన ఏకాదశి, 24న చిల్కు ద్వాదశి, తులసి వివాహం, క్షీరాబ్ధి ద్వాదశి, 25న వైకుంఠ చతుర్దశి, శని త్రయోదశి, 26న జ్వాలా తోరణం, కార్తీక పౌర్ణమి, 27న వ్యాస పున్నమి, 29 చాతుర్మాస ద్వితీయ, 30న సంకష్టహర చతుర్థి, డిసెంబర్ 4న సావిత్రి వ్రత కల్పాది, 8న ఉత్పాన ఏకాదశి, 11న యమ ప్రీతి దీదదానం, 12న కార్తీకమాసం వ్రత సమాప్తి.

శ్రీశైలంలో కార్తీక వైభవం

పరమశివుడు స్వయంభులింగంగా వెలసిన శ్రీశైలమహాపుణ్యక్షేత్రంలో నేటి నుంచి కార్తీకమాసోత్సవాలు వైభవంగా ప్రారంభంకానున్నాయి. ఈ మాసంలో శివుడిని ఆరాధించేందుకు భక్తులు ఆరాటపడుతూ శ్రీగిరికి అధికసంఖ్యలో తరలివస్తారు. కార్తీకమాసం ప్రారంభమైనప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని దీపారాధన చేసుకుంటారు. ఈ మాసంలో ప్రతి సోమవారం కన్నుల పండువగా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి, కార్తీకపౌర్ణమి రోజున కృష్ణానది వద్ద పుణ్యనదీహారతి, జ్వాలాతోరణం విశేషంగా జరుపుతారు. కార్తీకమాసంలో ప్రతిసోమవారం లక్షదీపోత్సవం, పుష్కరిణికి హారతి నిర్వహిస్తారు. ఆలయానికి సమీపంలోని పుష్కరిణి వద్ద సాయంత్రం 6.30గంటలకు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను తొడ్కొనివచ్చి విశేషంగా పూజాదికాలు నిర్వహిస్తారు. అలాగే కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని పాతాళగంగ వద్ద కృష్ణవేణమ్మ తల్లికి సాయంత్రం 5 గంటలకు పుణ్యనదీహారతి కార్యక్రమం నిర్వహించి వాయనంగా సారె సమర్పిస్తారు.





శ్రీశైల ఆలయం

26న జ్వాలాతోరణం

కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద సాయంత్రం 6 గంటలకు జ్వాలాతోరణాన్ని నిర్వహిస్తారు. అధికసంఖ్యలో భక్తులు జ్వాలాతోరణాన్ని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేసి స్తంభాలపై నెయ్యితో వత్తులను ఏర్పాటు చేసి వెలిగిస్తారు. ఇది తోరణంగా వెలుగుతుంది. ఈ జ్వాలాతోరణోత్సవాన్ని కన్నులారా చూసి తరించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. తోరణంలో కాలిన నూలు వత్తుల నుంచి వచ్చిన భస్మాన్ని భక్తులు నుదుట ధరించడం ఎంతో విశేషంగా భావిస్తారు.

వనభోజనాలు

కార్తీకమాసంలో ముఖ్యమైన అంశం వనభోజనాలు. ఈ వనభోజనాలను పలు వృక్షజాతులున్న వనంలో ఉసిరిక చెట్టు కిందనే చేయాలని శాస్త్రం చెబుతుంది. వనంలోనే వంటలను వండుకొని తినాలి. ఈ వంటల్లో ఉసిరిక కాయలను విధిగా వినియోగించాలి. వనభోజనాల్లో ముందుగా ఉసిరిక చెట్టు కింది భాగాన్ని గోమయంతో అలికి, పసుపు, కుంకుమలతో అలంకరించి చెట్టును పూజించాలి. అనంతరం చెట్టు కింద సాలగ్రామాన్ని ఉంచి, అర్చించి, వనంలోనే వండిన వంటకాలను నివేదించి, భుజించాలి. వనభోజనాలను చేయడం వలన అశ్వమేధయాగం చేసినంత ఫలితం లభిస్తుందని భక్తుల విశ్వాసం. వనభోజనాల సంప్రదాయంలో అధ్యాత్మిక అంశాలే కాకుండా సామాజిక ఏకత్వం లాంటి లౌకిక అంశాలు కూడ ఇమిడి ఉన్నాయి.

దీపారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు



శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు కార్తీకమాసోత్సవాలు నిర్వహించనుం. మల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేశాం. భక్తులకు కావాల్సిన తాగునీరు, సౌకర్యవంతమైన దర్శనం, వసతి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం, పాతాళగంగ వద్ద పుణ్యస్నానాలు ఆచరించేందుకు సౌకర్యాలు కల్పించాం. భక్తులు దీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయ ఉత్తరమాఢవీధిలో ఏర్పాట్లు చేశాం. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని తరించాలి.

– పెద్దిరాజు, ఈఓ, శ్రీశైలాలయం

అనంత పుణ్య ఫలం సిద్ధిస్తుంది



కార్తీక మాస వ్రతం హరి హరాదులకు అత్యంత ప్రీతికరం. ఈ మాసంలో నిర్వహించే పూజలతో సర్వదేవతా ఫలం సిద్ధిస్తుంది. సూర్యోదయానికి ముందు స్నానం, దీపారాధన, శివకేశవుల అర్చన, కార్తీక సోమవారాల వ్రతం, తులసీపూజ ధాత్రిపూజ, కార్తీక వనభోజనాలు, యధాశక్తి దాన ధర్మాలు చేసినట్లైతే సర్వ శుభాలు కల్గుతాయి. దీపంలోనే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతులను ఆవాహన చేసి పూజించినట్లైయితే అనంత పుణ్య ఫలం లభిస్తుంది.

– పి. చంద్రశేఖర శర్మ, పండితులు, కర్నూలు

వైఎస్సార్‌సీపీలో ముస్లింలకు సముచిత స్థానం

● డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కొత్తాళం: వైఎస్సార్‌సీపీలో ముస్లింలకు సముచిత స్థానం లభించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. ఖాదర్‌లింగ స్వామి దర్గా ఆవరణలో నిర్మించిన నూతన మసీదును ఆదోని, మంత్రాలయం, గద్వాల ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, మురళీకృష్ణమోహన్‌రెడ్డితో పాటు ఖాదర్‌లింగస్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీతో కలిసి డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేవన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింకు నాలుగు ఎమ్మెల్యే, నాలుగు ఎమ్మెల్సీ పదవులతో పాటు ఉప ముఖ్యమంత్రి పదివి ఇచ్చారని గుర్తు చేశారు. వైఎస్సార్ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించడంతో నేడు ఎంతో మంది వివిధ రంగాల్లో ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో ఒక్క ముస్లిం మంత్రి కూడా లేరన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను 20 సంవత్సరాల నుంచి దర్గాకు వస్తున్నానని, నేడు దర్గా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మనమధ్యలో దర్గా 10వ పీఠాధిపతి సయ్యద్ సాహెబ్‌పీర్ సాహెబ్ లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. అనంతరం కోసిగి, చిన్నతుంబళం, వివిధ గ్రామాల ముస్లింలు వక్ఫ్‌బోర్డు భూముల విషయంపై డిప్యూటీ సీఎంతో చర్చించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ముతవల్లి విభాగపు మెంబర్ ఖాజాసాబ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహల్లాదచారి, సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, మాజీ అధ్యక్షుడు వీరసేనరెడ్డి, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు ఉప్పరహాల్ ఏకాంబర్‌రెడ్డి, సుబ్బారాజు, చౌదరి బసవ, విద్యా కమిటీ చైర్మన్ వడ్డెరాము తదితరులు పాల్గొన్నారు.



మసీదును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, చిత్రంలో ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు సాయి ప్రసాద్ రెడ్డి, బాలనాగిరెడ్డి తదితరులు

మత సామరస్యానికి ప్రతీకలు దర్గాలు

● అజ్మీర్ దర్గా పీఠాధిపతి

మతసామరస్యానికి దర్గాలు ప్రతీకలుగా నిలిచాయని అజ్మీర్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గా ప్రధాన పీఠాధిపతి సయ్యద్ నసురుద్దీన్ చిష్తీ, కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ యూటీ ఖాదర్ అన్నారు. కొత్తాళంలోని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ఆవరణలో నిర్మించిన నూతన మసీదును వివిధ దర్గాల పీఠాధిపతులతో కలసి వారు ఆదివారం రాత్రి ప్రారంభించారు. ముందుగా ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దర్గాలో మతసామరస్యం కనిపిస్తోందన్నారు. హిందూ, ముస్లింలు కలిసికట్టుగా ఒకే చోటకు చేరే స్థలం దర్గాలే అన్నారు. అందరూ కులమతాలకు అతీతంగా కలసి మెలసి ఉన్నప్పుడే మంచి సమాజాన్ని స్థాపించవచ్చు అన్నారు. సమాజంలో మంచిని, శాంతిని, సోదరభావాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. గుల్బార్గ్ బందెనవాజ్ దర్గా పీఠాధిపతి సయ్యద్ గౌసుధరజ్ ఖుస్రు హుసేని చిష్తీ, బీదర్ అబుల్ ఫయ్యాజ్ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా అసదుల్లా హుసేని, వివిధ దర్గాల పీఠాధిపతులు తమ సందేశాన్ని ఇచ్చారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, గుల్షన్ కమిటీ అధ్యక్షుడు చిన్న మున్నపాషా చిష్తీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజ్మీర్ దర్గా పీఠాధిపతి

బురిడీ కొట్టించిన దొంగలు దొరికారు

● రూ.2 వేల నోట్ల మార్పిడి కేసులో ఇద్దరు ప్రధాన నిందితుల అరెస్ట్
● రూ. 30 లక్షలు స్వాధీనం
● ఇదే కేసులో మూడు నెలల క్రితం ఇద్దరు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదు, నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బొమ్మలసత్రం: దాదాపు నాలుగు నెలల క్రితం నంద్యాల పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారీని బురిడీ కొట్టించి రూ. 2.20 కోట్లు అపహరించిన ముఠాలో ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో సీఐలు దస్తగిరిబాబు, రవీంద్రలు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వివరించారు. పట్టణానికి చెందిన శ్రీనివాసరెడ్డి స్థానిక ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముంటున్నాడు. ఈయన పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. శ్రీనివాసరెడ్డి వద్దకు వరప్రసాద్ అనే మధ్యవర్తి వచ్చి గుంతకల్లుకు చెందిన కొందరి వద్ద రూ. 3 కోట్లు 2 వేల నోట్లు మిగిలి ఉన్నాయని వాటిని తీసుకుని రూ. 2.20 కోట్ల విలువైన రూ. 500 నోట్లు ఇస్తే చాలని ఆశ చూపాడు. దీనికి ఆశపడిన శ్రీనివాసరెడ్డి తనకు తెలిసిన వారి నుంచి రూ.500 నోట్లు మొత్తం రూ. 2.20 కోట్లు సమకూర్చాడు. జూలై నెల 22 వ తేదీ నంద్యాల శివారులోని రైతునగరం వద్ద ఉన్న జాతీయరహదారి వద్దకు వెళ్లాడు. అప్పటికే కారులో సిద్ధంగా ఉన్న విశాఖపట్నానికి చెందిన శోభన్‌బాబు, శ్రీకాకుళంకు చెందిన చిన్నబాబు కలిసి శ్రీనివాసరెడ్డితో మాటలు కలిపారు. ఇంతలో మరో ఇద్దరు విశాఖ పట్టణానికి చెందిన అమిత్‌రెడ్డి, శ్రీకాకుళానికి చెందిన లోక్‌నాథ్ పోలీస్ వాహనంలో సైరన్ వేసుకుని రావటంతో శ్రీనివాసరెడ్డి కంగారు పడ్డాడు. నిందితులు శ్రీనివాసరెడ్డి చేతిలో ఉన్న నగదు బ్యాగును లాక్కుని కారులో పరారయ్యారు. శ్రీనివాసరెడ్డి తేరుకొనేలోగా అక్కడ నిందితుల కారుతో పాటు, పోలీస్ జీపు కనిపించకుండా పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కారుకు ఉన్న ఫాస్ట్‌ట్రాగ్ అకౌంట్ ద్వారా ఇద్దరు నిందితులను గుర్తించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 7వ తేదీ శోభన్‌బాబు, చిన్నబాబును అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 70 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇదే కేసులో ఈనెల 12వ తేదీ ప్రధాన నిందితులైన అమిత్‌రెడ్డి, లోక్‌నాథ్‌లను విశాఖపట్నంలో అరెస్ట్ చేశారు. ఇద్దరిని నంద్యాలకు తరలించి సోమవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

● సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: శ్రీశైలం నియోజకవర్గానికి ఈనెల 24న చేరుకునే వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలతో సామాజిక సాధికార బస్సు యాత్రపై ఎమ్మెల్యే శిల్పా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సాధికార బస్సు యాత్రతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించనున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని చాటి చెప్పేందుకు ఈ యాత్రను చేపట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన ముఖ్య నాయకులు ఈ యాత్రలో పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, సింగిల్ విండో చైర్మన్లు వంగాల నాగేశ్వరరెడ్డి, బన్నూరు అంకిరెడ్డి, మండల కార్యదర్శి కే.రామ్మోహన్‌రెడ్డి, ముంతల విజయ భాస్కర్‌రెడ్డి, ఎం. సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, తెలుగు రమణ, గోవిందు, అమీర్ అలీఖాన్, శివయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

50వేల ఖాతాలు ప్రారంభిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): రాబోయే రెండు నెలల్లో ఇంటింటికీ వెళ్లి ఖాతాలు ప్రారంభించే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. సేవింగ్, కరంట్ ఖాతాలు కనీసం 50వేలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశ మందిరంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బ్రాంచ్ మేనేజర్లతో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలు ప్రారంభించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. డోన్, పత్తికొండ, కృష్ణానగర్, ఆదోని, ఆలూరు బ్రాంచ్‌ల్లో బకాయిలు ఎక్కువగా ఉన్నాయని, రికవరీపై దృష్టి సారించాలని తెలిపారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సొంత నిధులు సమకూర్చుకోవడంపై దృష్టి సారించాలన్నారు. కొత్తగా సహకార సమృద్ధి డిపాజిట్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్నామని, ఇది నెల రోజులు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. 456 రోజుల కాలపరిమితితో చేసే డిపాజిట్‌లపై సీనియర్ సిటిజన్‌లకు 8.2 శాతం, ఇతరులకు 7.70 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. సమావేశంలో సీఈఓ రామాంజనేయులు, నంద్యాల రీజినల్ మేనేజర్ శివలీల, డీజీఎంలు ఉమమహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఆప్కాబ్ డీజీఎం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ చేసుకోకుండానే..

● గుండెపోటుతో రైల్వే ప్రయాణికుడి మృతి
● మానవత్వం చాటిన రైల్వే అధికారులు
● నంద్యాలలో అంత్యక్రియలు

నంద్యాల(న్యూటౌన్): దీపావళి పండుగను బంధు, మిత్రుల మధ్య జరుపుకునేందుకు సొంతూరు బయలుదేరిన ఓ వ్యక్తి రైలులో గుండెపోటుతో మృతి చెందాడు. నంద్యాల రైల్వే స్టేషన్‌మేనేజర్ దొరస్వామి, రైల్వే సీఐ భాస్కర్ తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బాలాచూర్ సమీపంలోని ఈశ్వరపూరు గ్రామానికి చెందిన దంపతులు ఖుషేదాస్(48), జయంతిచారు ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం బెంగళూరు వెళ్లారు. అక్కడ చిన్నపాటి ఉద్యోగం చేస్తూ జీవించేవారు. వీరికి సంతానం లేదు. దీపావళి పండుగకు సొంతూరు వెళ్లేందుకు శనివారం బెంగళూరు నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో దంపతులు బయలుదేరారు. మార్గమధ్యలో రైలు డోన్ రైల్వే స్టేషన్ దాటిన కొద్దిసేపటి తర్వాత ఖుషేదాస్‌కు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రయాణికులు, టికెట్ కలెక్టర్ సమాచారం ఇవ్వడంతో నంద్యాల రైల్వే అధికారులు, రైల్వే పోలీసులు స్పందించారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. పేదరికం కారణంగా భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లలేనని భార్య జయంతిచారు చెప్పడంతో నంద్యాలలోని స్వర్గధామంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం స్పెషల్ టికెట్ కలెక్టర్ వెంట ఉండి ఆమెను సొంత గ్రామమైన ఒడిసాలోని ఈశ్వరపూర్‌కు చేర్చారు. మానవత్వం చాటిన రైల్వే అధికారులను పలువురు ప్రశంసించారు.



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఎద్దులను ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి



మృతి చెందిన అన్వర్ హుస్సేన్

సంజామల: అతి వేగం ఓ వ్యక్తి ప్రాణాలను బలి తీసుకుంది. సంజామల ఎస్‌ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. ముదిగేడు గ్రామానికి చెందిన అన్వర్ హుస్సేన్ (42) దీపావళి పండగ సందర్భంగా టపాసులు కొనుగోలు చేసేందుకు ఆదివారం సాయంత్రం భార్య, చిన్న కుమారుడు బైక్‌పై కోవెలకుంట్లకు వెళ్లారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వస్తున్న సమయంలో గ్రామ శివారులో అకస్మాత్తుగా పొలంలో నుంచి ఎద్దులు రోడ్డుపైకి రావడంతో బైక్ వేగాన్ని అదుపు చేయలేక ఎద్దులను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అన్వర్ హుస్సేన్ తలకు తీవ్ర గాయమైంది. అతని భార్య బసురున్‌బీ, చిన్న కుమారుడు అయాన్‌కు గాయాలయ్యాయి. అన్వర్‌హుస్సేన్‌ను చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. అయాన్‌ను మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

భార్య మందలించిందని..

● రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: మద్యానికి బానిసై కుటుంబ పోషణను పట్టించుకోవడం లేదని భార్య మందలించటంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సోమవారం నంద్యాలలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ జలీల్ తెలిపిన వివరాల మేరకు.. శిరివెళ్ల మండలం వణికినిదిన్నె గ్రామానికి చెందిన ప్రతాప్‌గౌడ్ (37), ధరణి దంపతులకు ఇద్దరు కుమారులు. కొంత కాలంగా ప్రతాప్‌గౌడ్ కుటుంబాన్ని పట్టించుకోకుండా స్నేహితులతో కలిసి విశాఖపట్నంలో ఉంటున్నాడు. ధరణి పట్టణంలోని ఓ మెడికల్ షాప్‌లో పని చేస్తుంది. ఈక్రమంలో గత రెండు రోజుల క్రితం పెద్దలు మందలించడంతో ప్రతాప్‌గౌడ్ స్వగ్రామానికి చేరుకున్నాడు. ఆదివారం భార్యాభర్తల మధ్య వివాదం రావడంతో ప్రతాప్‌గౌడ్ పట్టణానికి వచ్చాడు. సోమవారం వేకువజామున నంద్యాల మండలం ఉడుమాల్పురం గ్రామ శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రామసుబ్బయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలిక ఆత్మహత్య



మృతి చెందిన మండ్ల మల్లిక

నందికొట్కూరు: పట్టణంలో నివసిస్తున్న మండ్ల చిన్నరాముడు, రమణమ్మ దంపతుల కుమార్తె మల్లిక సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పగిడ్యాల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న మల్లిక దీపావళి పండుగ సందర్భంగా శనివారం ఇంటికి చేరుకుంది. ఇంటి వద్ద హుషారుగా ఉన్న బాలిక సోమవారం తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన తర్వాత ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, కేసు దర్యాప్తులో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని టౌన్ సీఐ తెలిపారు.

సిఫారసు మేరకే పురుగు మందుల పిచికారీ



మాట్లాడుతున్న నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణరావు

కర్నూలు(అగ్రికల్చర్): సిఫారస్సు మేరకే పురుగు మందులు పిచికారీ చేసేలా రైతుల్లో అవగాహన పెంచాలని నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని పురుగుమందుల వినియోగంపై సూచనలు చేశారు. నూతన పురుగు మందులు సిఫారసు చేసిన మోతాదుకు మించి వాడటం వల్ల పురుగులు రోగనిరోధక శక్తిని పెంచుకుంటాయన్నారు. రైతులు ప్రతి అవసరానికి డీలర్ల వద్దకే వస్తుంటారని, పురుగుమందుల వినియోగంపై అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో దేశీ డిప్లమా కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర, ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గిడ్డమ్మ, శ్రావణి



గిడ్డమ్మ



శ్రావణిరెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఏపీ మహిళా సమైఖ్య జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా మాజీ కార్పొరేటర్ గిడ్డమ్మ, శ్రావణిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సమాఖ్య రాష్ట్ర నాయకురాలు జె.లలితమ్మ తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో సీపీఐ కార్యాలయంలో ఏపీ మహిళా సమైఖ్య 19వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సభల్లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 9 మంది ఆఫీసు బేరర్లు, 25 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు చెప్పారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలుగా జె.లలితమ్మ ఎంపికయ్యారు.

బోరు బండిలో చెలరేగిన మంటలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ పొలాల్లో బోరు రిగ్గు వేస్తున్న బండికి సపోర్టుగా ఉండే మరో వాహనంలో సోమవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మూలింటి సుధాకర్ తన పొలంలో బోరు వేయించేందుకు మధ్యవర్తి ద్వారా బోరు బండిని పిలుపించుకున్నారు. బోరు వేస్తున్న సమయలో పక్కనున్న బండిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడి వారంతా ఆ వాహనంలో గ్యాస్ ఉంటుందనే భయంతో పరుగులు పెట్టారు. నిప్పంటుకున్న వాహనాన్ని డ్రైవర్ సమీపంలోని నీటి కాల్వ వద్దకు తీసుకురాగా అక్కడి పంట పొలాల్లో ఉన్న వారంతా మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకుని డోన్ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో వాహనదారుడికి సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వారు తెలిపారు.



తుపాకీతో బెదిరించి దోపిడీకి యత్నం

ఆలూరు: ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన వడ్డె నాగేశ్‌ను స్థానికంగా ఓ క్వారీలో పనిచేస్తున్న యూపీకి చెందిన ఇద్దరు కార్మికులు తుపాకీతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన సంఘటన సోమవారం రాత్రి 9 గంటలకు జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు నుంచి సోమవారం రాత్రి వడ్డె నాగేశ్ బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఆ సమయంలో దారి కాచిన యూపీకి చెందిన అముక, రాజ్ అనే ఇద్దరు యువకులు నాగేశ్‌ను అడ్డుకుని తుపాకీతో బెదిరించి డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. అతని వద్ద ఉన్న నగదు దోచుకుని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు రంగంలోకి దిగి నిందితులను పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని తుపాకీ నకిలీదా? లేదా అసలైందేనా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

ఆలూరు: ఆటో సీరియల్ పెట్టుకునే విషయంలో డ్రైవర్ల మధ్య ఎర్పడిన ఘర్షణలో ఒకరిపై దాడి జరిగింది. వివరాలు.. అరికెర గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు రంగముని, మల్లేష్ ఆలూరు నుంచి గ్రామానికి ఆటో నడుపుతుంటారు. సోమవారం ఆటో సీరియల్ పెట్టుకునే విషయంలో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. అనంతరం రంగముని ఆలూరు నుంచి వెళ్లిపోయాడు. కాసేపటికి మల్లేష్ తన ఆటో నడుపుకుంటూ వస్తుండగా మార్గమధ్యలో కాపు గాసి దాడికి పాల్పడ్డాడు. రంగముని గొడ్డలితో దాడి చేయడంతో మల్లేశ్ కడికాలికి తీవ్ర గాయమైంది. బాధితుడిని మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

పూజలందుకున్న సంగమేశ్వరుడు



బయల్పడుతున్న ప్రాచీన సంగమేశ్వరాలయం



ప్రాచీన సంగమేశ్వరాలయంలో పూజాకార్యక్రమాలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: శ్రీశైలం నీటిమట్టం క్రమేపీ తగ్గుతుండడంతో ప్రాచీన సంగమేశ్వరాలయం బయట పడుతుంది. ఆదివారం నరక చతుర్దశి దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజశ్యామల, మహాలక్ష్మీ, గాయత్రీదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నదిజలాలతో అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చనలు వంటి విశేషపూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు ప్రాచీన సంగమేశ్వరాలయంలో శివలింగానికి పూజలు నిర్వహించుకున్నారు.

స్థలం విషయంలో ఘర్షణ

● 11 మందిపై కేసు నమోదు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో ఇంటి స్థలం విషయంలో ఆదివారం ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో 11 మందిపై రూరల్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. వివరాలు.. గ్రామానికి చెందిన కుమ్మరి సరోజమ్మకు చెందిన సర్వే నంబర్ 241లో ప్రభుత్వ పట్టా స్థలాన్ని కుమ్మరి పద్మ పదేళ్ల క్రితం కొనుగోలు చేసింది. ప్రభుత్వ స్థలంలో ఎటువంటి నిర్మాణం జరగకపోవడంతో 2020లో జగనన్న కాలనీ కింద బోయ పద్మకు సర్వే నంబర్ 241/బిలో 1.50 సెంట్ల ఇంటి స్థలం కేటాయిస్తూ అధికారులు పట్టాను అందజేశారు. అప్పటినుంచి కుమ్మరి పద్మ తన స్థలంలో ఇంటి నిర్మాణం ఎలా చేపడతారని గొడవ పడుతూనే ఉంది. తమకు అధికారులు ఇంటి స్థలం కేటాయించారని ఏదైనా ఉంటే రెవెన్యూ అధికారులతో తేల్చుకోవాలని బోయ పద్మ కుటుంబసభ్యులు చెబుతున్నా ఆమె పట్టించుకోలేదు. ఈ క్రమంలో బోయ పద్మ తనకు మంజూరైన స్థలంలో హద్దుల కోసం చుట్టూ బండలు ఏర్పాటు చేసుకుంది. ఆదివారం ఉదయం ఈ విషయంపై తన స్థలంలో బండలు ఎలా పాతుతారంటూ బోయ పద్మ మామ నరసింహులుతో కుమ్మరి పద్మ వాగ్వాదానికి దిగింది. దీంతో ఘర్షణ ఏర్పడి ఇరు కుటుంబాల వారు దాడులు చేసుకున్నారు. తనను కొట్టారంటూ కుమ్మరి పద్మ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నరసింహులుతో పాటు మరో నలుగురిపై ఫిర్యాదు చేసింది. ఇదే ఘర్షణలో తమకు ప్రభుత్వం ఇచ్చి పట్టాలో బండలు పాతుకుంటే కుమ్మరి పద్మతో పాటు ఆమె కుటుంబ సభ్యులు దౌర్జన్యంగా తొలగించారని బోయ పద్మతో ఆరుగురిపై ఫిర్యాదు చేసింది. ఈ ఘర్షణపై రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంటి స్థలం విషయంలో జరిగిన ఘర్షణలో ఇరు కుటుంబాలకు చెందిన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.